రెడ్‌మార్క్ ప్లాట్లెక్కడ?

జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో కనిపించని రెడ్‌మార్క్ స్థలాలు

- మౌలిక సదుపాయాల కోసం గతంలోనే 249 ప్లాట్ల గుర్తింపు
- ప్రస్తుతం అంగన్‌వాడీ, సులబ్ కాంప్లెక్స్‌లకు స్థలం కరువు
- ఖాళీ స్థలాల కోసం అధికారుల వేట
- కార్పొరేషన్‌లో అన్యాక్రాంతమైన రెడ్‌మార్క్ స్థలాలు





27వ డివిజన్‌లో రెడ్‌మార్క్ స్థలంలో నూతన నిర్మాణం

జవహర్‌నగర్: ప్రభుత్వానికి సంబంధించి కోట్లాది రూపాయల విలువ చేసే స్థలాలు గ్రామకంఠం పరిధిలోనే ఉన్నాయి. వాటిని కాపాడుకోవడంలో అధికారులు పూర్తిస్థాయిలో విఫలం చెందారు. 2016 సంవత్సరంలో గ్రామ కంఠం ఏర్పాటు చేసే క్రమంలో 249 ఖాళీ ప్లాట్లను రెవెన్యూ అధికారులు గుర్తించి నాటి పంచాయతీ కార్యదర్శికి అప్పగించారు. గ్రామపంచాయతీ నుంచి కార్పొరేషన్ ఏర్పాటయ్యే సరికి 249 ఖాళీ ప్లాట్లు కనుమరుగయ్యాయి. దీంతో అధికారులు మరోసారి సర్వే చేసి హద్దులను గుర్తించే పనిలో పడ్డారు. గ్రామ స్థాయి నుంచి కార్పొరేషన్ స్థాయికి జవహర్‌నగర్ చేరడంతో మౌలిక సదుపాయాల కోసం స్థలాలను సేకరించాల్సి ఉంది. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాలు సొంత భవనాలు లేక అద్దె గదుల్లోనే కాలం వెల్లదీస్తున్నారు. జవహర్‌నగర్ గ్రామకంఠం పరిధిలో ప్రభుత్వ మౌలిక సదుపాయాల కోసం రెవెన్యూ, మున్సిపల్ అధికారులు స్థలాలను గతంలో గుర్తించారు. కాగా పంచాయతీ నుంచి మున్సిపల్‌గా ఆవిర్భవించే క్రమంలో రెవెన్యూ అధికారులు గ్రామకంఠం పరిధిలో 249 ఖాళీ ప్లాట్లను గుర్తించి గ్రామ పంచాయతీ అధికారులకు అప్పగించి ఆ ప్లాట్లలో జిల్లా కలెక్టర్ అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం గ్రామపంచాయతీ నుంచి మున్సిపల్ ఆ తర్వాత కార్పొరేషన్ స్థాయికి జవహర్ నగర్ చేరడంతో స్థలాల అవసరం మరింత ఎక్కువైంది. దీని కోసం గతంలో గుర్తించిన ఖాళీ స్థలాలను కనిపెట్టే పనిలో పడ్డారు. గతంలో కాప్రా తహసీల్దార్ గౌతమ్‌కుమార్, జవహర్‌నగర్ కమిషనర్ మంగమ్మ నేతృత్వంలో ఆ స్థలాలను గుర్తించి హద్దులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అంగన్‌వాడీ, సులబ్ కాంప్లెక్స్‌తో పాటు ప్రజావసరకాల కోసం అధికారులు ఖాళీ స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయని వేట ప్రారంభించారు.

కన్నేసి కబ్జా..

రెడ్‌మార్క్ స్థలాల్లో అనుమతులు ఇచ్చారన్న ఆరోపణలపై పంచాయతీ కార్యదర్శిని అప్పట్లోనే జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఆ తర్వాత ఎన్నికలు రావడంతో ఎన్నికల దృష్ట్యా రెవెన్యూ అధికారులు బదిలీ కావడంతో కబ్జాదారులకు వరంగా మారింది. రెడ్‌మార్క్ స్థలాలపై కన్నేసిన కొందరు వాటిని కబ్జా చేశారు. మరికొందరు ఏకంగా బై నంబర్లతో అనుమతులు తీసుకుని, నిర్మాణాలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.

కార్పొరేటర్ల కనుసన్నల్లో కనుమరుగు..!

రెడ్‌మార్క్ స్థలాలను గ్రామ పంచాయతీ పాలనలో అధికారులు కాపాడారు. ప్రస్తుత కార్పొరేషన్‌లో 249 రెడ్‌మార్క్ స్థలాలు కనిపించకుండా పోయాయి. వీటిలో చాలా వరకు కార్పొరేటర్ల కనుసన్నల్లో కనుమరుగు కాగా మరి కొన్నింటిని స్వయంగా కార్పొరేటర్లే కబ్జా చేశారని ఆరోపణలు ఉన్నాయి.

వసతులకు భూములు కరువు...

ప్రభుత్వ భూములకు కేరాఫ్‌గా చెప్పుకునే జవహర్‌నగర్‌లో మౌలిక సదుపాయాల కోసం భూములు దొరకడం లేదు. భూములన్నీ ఎవరో ఒకరి స్వాధీనంలోనో.. కోర్టు కేసుల్లోనో.. ఉంటాయని అంటున్నారు. ఉదాహరణకు ప్రభుత్వ స్థలం లేదని కార్పొరేషన్ ఎదుటే సులబ్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేశారు.

బై నంబర్ల అనుమతులు

గ్రామకంఠం పరిధిలోని రెడ్‌మార్క్ స్థలాల్లో పలువురు బై నంబర్లతో అనుమతులు తీసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మరికొందరైతే రాజకీయ అండదండలతో ఎలాంటి అనుమతులు లేకుండానే ప్లాట్లలో బహుళ అంతస్తులు నిర్మించారు. నిబంధనల ప్రకారం బై నంబర్లతో తీసుకున్న అనుమతులు చెల్లుతాయా.. అసలు అనుమలు ఉన్నాయా.. లేవా.. లేక ఇస్తే.. ఎవరు ఇచ్చారు.. ఎలా ఇచ్చారు.. అనే విషయంపై అధికారులు సమగ్ర విచారణ జరిపితే అన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. ఈ విషయంపై అధికారులే ధృవీకరించాల్సి ఉంది.

పూర్తి స్థాయిలో విచారణ చేస్తాం



ఖాళీ స్థలాలను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. గతంలో గుర్తించిన రెడ్‌మార్క్ స్థలాల విషయం మా దృష్టికి వచ్చింది. నాడు రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ అధికారి సంయుక్తంగా సర్వే చేశారని తెలిసింది. రెడ్‌మార్క్ స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నా యో వాటిని పరిశీలించి ప్రజావసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకుంటాం. అవసరమైతే మరోసారి సర్వే చేసి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం.

– రామలింగం, కమిషనర్, జవహర్‌నగర్

రెడ్‌మార్క్ స్థలాలపై పూర్తి అధికారం కలెక్టర్‌దే..



జవహర్‌నగర్ గ్రామకంఠం పరిధిలో గుర్తించిన 249 ప్లాట్లపై సర్వాధికారాలు కలెక్టర్‌కే ఉన్నాయి. అందులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు. దీనిపై గతంలోనే సర్వే నిర్వహించారు. అర్హులెవరైనా ఉంటే వాటికి సంబంధించిన పట్టాలు, ఆధారాలు ఏవైనా ఉంటే వాటిని పరిశీలిస్తాం. జవహర్‌నగర్‌లో గ్రామకంఠం పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలను ప్రజావసరాలకు మాత్రమే వినియోగించాలి. ఖాళీ స్థలాలను ఎవరైనా కబ్జా చేయాలని ప్రయత్నిస్తే వారెంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటాం.

– రవి, కీసర ఆర్డీఓ

4న సర్వసభ్య సమావేశం

మేడ్చల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మార్చి 4వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు. అధికారులు పూర్తి సమాచారంతో.. సకాలంలో హాజరు కావాలని ఆమె అన్నారు.

క్రైం కార్నర్..

హైటెన్షన్ స్తంభానికి ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన అనిల్‌రెడ్డి

మేడ్చల్‌రూరల్: హైటెన్షన్ విద్యుత్ స్తంభానికి ఉరివేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. సీఐ రాజశేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం... నిజామాబాద్ జిల్లా రేకులపల్లి గ్రామానికి చెందిన పదిరే అనిల్‌రెడ్డి(25) ఇటీవల లండన్ నుంచి తిరిగి ఇంటికి వచ్చాడు. గత కొద్ది రోజులుగా ఇతరులతో మాట్లాడేందుకు ఇష్టపడకుండా ఒంటరిగా ఉంటున్న అనిల్‌రెడ్డి మంగళవారం ఉదయం మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధి అత్వెల్లి సమీపంలో జాతీయ రహదారికి పక్కన ఉన్న హైటెన్షన్ విద్యుత్ స్తంభానికి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న మేడ్చల్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. అతడి జేబులో ఉన్న వివరాల ఆధారంగా కుటుంబీకుల సమాచారం అందించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కాగా మృతుడు వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని, ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బైక్ దొంగిలించి పరారవుతుండగా లారీ ఢీ

- తీవ్ర గాయాలు కావడంతో దొంగను ఆస్పత్రికి తరలింపు

శామీర్‌పేట్: బైక్ దొంగతనాలనికి పాల్పడిన వ్యక్తిని పరారవుతుండగా మార్గమధ్యలో రోడ్డు ప్రమాదానికి గురైన ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, బైక్ యజమాని వివరాల ప్రకారం.. మూడుచింతలపల్లి మండలం ద్రాస్‌పల్లి గ్రామానికి చెందిన శ్రీపతి పొన్నయ్య తన ద్విచక్ర వాహనాన్ని (టీఎస్08జీజీ0277) ఇంటి ముందు పార్క్ చేసి ఉంచాడు. ఇతర రాష్ట్రానికి చెందిన గుర్తుతెలియని వ్యక్తి బైక్‌ను దొంగిలించి ఆ బైక్‌పై పరారవుతుండగా ఉప్పర్‌పల్లి గ్రామ సమీపంలో ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టాడు. దీంతో అతడు తీవ్ర గాయాలపాలు కావడంలో ఆస్పత్రికి తరలించారు. పోలీసులు లారీ–బైక్‌ను శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బైక్ యజమాని పొన్నయ్య తన వాహనం చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై పోలీసులు ఎలాంటి కేసు నమోదు కాలేదని తెలిపారు.

క్లుప్తంగా...

మెకానిక్‌లకు ప్రత్యేక ప్రాంతం ఏర్పాటు చేయాలని వినతి



మంత్రి మల్లారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న మేడ్చల్ మెకానిక్‌లు

మేడ్చల్: మెకానిక్‌లు వాహనాలను రిపేరు చేయడానికి దుకాణ సముదాయాలు ఏర్పాటు చేసుకోవడానికి చెక్ పోస్ట్ వద్ద ప్రత్యేక స్థలం ఏర్పాటు చేయాలని మేడ్చల్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మంత్రి మల్లారెడ్డిని కోరారు. కౌన్సిలర్ మణికంఠగౌడ్‌తో కలిసి మంత్రి నివాసానికి మంగళవారం వెళ్లి వినతి పత్రం సమర్పించారు. అన్ని రకాల వాహనాల రిపేర్లకు అడ్డాగా చెక్ పోస్ట్ ఉందని, ఒకే దగ్గర లేక పోవడంతో మెకానిక్‌లు, యజమానులు ఇబ్బందులు పడుతున్నారని, ఆటోనగర్ మాదిరి గా ఒకే ప్రాంతంలో అన్ని ఉండేలా స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రఫీక్, లాయక్ అలీ, కంచియాదవ్, రాజు, బాబర్, షౌకత్‌అలీ తదితరులు ఉన్నారు.

హక్కుల ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు తప్పవు

సాక్షి, సిటీబ్యూరో: రాజ్యాంగం ప్రసాదించిన దళిత, గిరిజన హక్కుల విషయంలో ఎవరైనా ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మేడ్చల్ డిప్యూటీ తహసీల్దార్ దిలీప్‌కుమార్ అన్నారు. మండలంలోని పూడూర్ గ్రామంలో సర్పంచ్ బాబుయాదవ్ అధ్యక్షతన మంగళవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులను ప్రభుత్వం పటిష్టంగా అమలు చేస్తోందని, మతాలు, కులాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాబుయాదవ్, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు ధన్‌రాజ్ నాయక్, ఉపసర్పంచ్ వెంకటేశ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పోచారం: అన్నోజిగూడలోని రాజీవ్ గృహకల్ప కాలనీకి చెందిన మహ్మద్ యాకుబ్ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. అంత్యక్రియల కోసం కౌన్సిలర్ మెట్టు బాల్‌రెడ్డి రూ.5వేలు మృతుడి కుటుంబానికి సాయంగా అందజేసి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. యాకుబ్ మృతి పట్ల ఆదర్శ యూత్ సభ్యులు, కాలనీవాసులు సంతాపం వ్యక్తం చేశారు.

'మేడ్చల్‌ను అధ్వానంగా మార్చారు'



బీజేపీ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న నాయకులు

మేడ్చల్: అధికార పార్టీ కౌన్సిలర్లు, చైర్ పర్సన్లు కుర్చీ కోసం కొట్లాడుతూ మేడ్చల్ పట్టణాన్ని అధ్వానంగా మార్చారని బీజేపీ నాయకులు విమర్శించారు. 'ప్రజాగోస–బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని వివిధ వార్డులలో బూత్‌లు 57, 58, 59లలో నిర్వహించిన పార్టీ శక్తి కేంద్రాల కార్నర్ మీటింగ్‌లలో వారు మాట్లాడుతూ.. వార్డుల్లో సమస్యలు తాండవం చేస్తున్నా పాలకులు ఎక్కడా కనిపించడం లేదన్నారు. సమావేశాల్లో పార్టీ నాయకులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఆంజనేయులు, గాంధీయాదవ్, హేమలతారెడ్డి, రాఘవరెడ్డి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం రామలింగేశ్వరుడి కల్యాణం



మేడ్చల్‌లో ప్రసిద్ధిగాంచిన దాక్షాయని రామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామి వారి కల్యాణంను వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలో భాగంగా మంత్రి మల్లారెడ్డి దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు దీపికానర్సింహారెడ్డి, ధర్మకర్తలు, పట్టణ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు. – మేడ్చల్



మునీరాబాద్‌ను సందర్శించిన మధ్యప్రదేశ్ బృందం



మునీరాబాద్‌లో మిషన్ భగీరథ నీటి పంపిణీ తీరు పరిశీలిస్తున్న మధ్యప్రదేశ్ బృందం

సాక్షి, సిటీబ్యూరో: మండలంలోని మునీరాబాద్ గ్రామాన్ని మంగళవారం మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సర్పంచ్‌లు, అధికారుల బృందం సందర్శించారు. జల జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా గ్రామ సందర్శనకు వచ్చిన బృందం గ్రామంలో మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి అందిస్తున్న గోదావరి జలాల సరఫరా తీరు పరిశీలించారు. గ్రామంలోని మిషన్ భగీరథ ఓవర్‌హెడ్ ట్యాంకులను సందర్శించి నీటి సరఫరా వివరాలు, క్లోరినేషన్ పద్ధతి, గోదావరి నుంచి ఏ విధంగా.. ఎంత పరిమాణంలో.. ఎన్నిసార్లు నీటిని సరఫరా చేస్తున్నరనే విషయాలతో పాటు ఇంట్లో ఎంతమందికి సరిపడా సరఫరా చేస్తున్నారో అధికారులు, సర్పంచ్, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పంచాయతీ ఆదాయ, వ్యయాలు, ఉపాధి హామీ నిధుల వినియోగం, అంగన్‌వాడీలో గర్భిణులు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ గణేశ్, మిషన్ భగీరథ సిద్దిపేట ఈఈ గిరిధర్, మేడ్చల్ డీఈఈ మహేందర్, ఏఈ శామ్యూల్, ఏఈఈ వసుధ, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా దినోత్సవాన్ని నిర్వహించేందుకు అనుమతివ్వండి



సాక్షి,మేడ్చల్ జిల్లా: మహిళా దినోత్సవం కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో మార్చి 6న నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ మంగళవారం జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్‌కు ఉద్యోగుల జేఏసీ చైర్మన్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షుడు రవి ప్రకాష్ వినతి పత్రం ద్వారా కోరారు. ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని కలెక్టర్‌ను ఆహ్వానించారు. కార్యక్రమంలో ఈశ్వర్, శ్రీదేవి, రజిని, పద్మ, కొండల్, జేమ్స్‌దాస్, శ్రీనివాస్, నజీమా, జ్యోతి, అరుణ, అనిత, అన్నపూర్ణ, నిర్మలకుమారి, హైమావతి, యాదమ్మ, పుష్ప, విజయ పాల్గొన్నారు.



దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధి సర్వే నంబర్ 142, 143లో వైకుంఠధామానికి కేటాయించిన స్థలంకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ప్రొసీడింగ్ కాపీలు హెచ్‌ఎండీఏ నుంచి మంజూరు చేయించాలని మంత్రి మల్లారెడ్డి సమక్షంలో మంగళవారం మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ను కలిసి వినతి పత్రం ఇస్తున్న చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య తదితరులు. – కీసర

అభివృద్ధి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ గోపాల్‌రెడ్డి

కీసర: కరీంగూడ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లడం జరుగుతుందని సర్పంచ్ కొకుట్ల గోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం గ్రామంలో ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బి.మాధవరెడ్డి, ఎంపీటీసీ మంచాల కిరణ్ జ్యోతిప్రవీణ్, వార్డుసభ్యులు కందాడి ఉమాకృష్ణారెడ్డి, దేశం పరమేష్‌గౌడ్, కోఆప్షన్ సభ్యులు కందాడి శివరాంరెడ్డి, కందాడి అంజిరెడ్డి, దేశం లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

ఘట్‌కేసర్: కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని చైర్‌పర్సన్ పావనీయాదవ్, వైస్‌చైర్మన్ మాధవరెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని పదో వార్డులో స్థానిక కౌన్సిలర్ శశికళతో కలిసి కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రవీందర్, జంగయ్య యాదవ్, రాధాకృష్ణ ముదిరాజ్, మాజీ వార్డు సభ్యుడు దేవేందర్ ముదిరాజ్, ఆంజనేయులు, శశిధరన్, నాగభూషణం, లక్ష్మారెడ్డి, సురేశ్, పీహెచ్ఎన్ విమల, కంటి నిపుణులు శిరీష, డీఈఓ సాత్విక్, సిబ్బంది విజయ, రాజేశ్వరీ, ఆశ వర్కర్లు లక్ష్మీ, మేఘమాల పాల్గొన్నారు.



శిబిరంను పర్యవేక్షిస్తున్న చైర్‌పర్సన్ పావనీయాదవ్

అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారుల కొరడా



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

జవహర్‌నగర్: అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపించారు. మంగళవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నంబర్ 284లతో పాటు పలు ప్రాంతాల్లో నూతనంగా వెలసిన అక్రమ నిర్మాణాలను పోలీసు బందోబస్తు నడుమ తొలగించారు. ఈ సందర్భంగా కాప్రా మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ మాట్లాడుతూ.. చాలా ప్రాంతాల్లో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని, ప్రభుత్వ స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దని హెచ్చరికలు జారీ చేసినా కొందరు కబ్జాదారులు పట్టించుకోవడం లేదన్నారు. మరోమారు నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

'కుల వృత్తులకు ప్రభుత్వం అండగా ఉంటుంది'



టైలర్స్ డే కార్యక్రమంలో మేయర్ మేకల కావ్య

జవహర్‌నగర్: కులవృత్తులకు ప్రభుత్వం అండగా ఉంటుందని జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య అన్నారు. మంగళవారం జవహర్‌నగర్‌లో నిర్వహించిన టైలర్స్ డే వేడుకలో మేయర్ పాల్గొని మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలోనే కులవృత్తులకు సమన్యాయం జరుగుతుందని, ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో మేరు సంఘం అధ్యక్షుడు వేణు, టీఆర్ఎస్ జిల్లా నాయకుడు మేకల అయ్యప్ప, కోఆప్షన్ సభ్యురాలు శోభారెడ్డి, మేరు సంఘం నాయకులు సంతోష్, ప్రవీణ్, రవి, రమేష్, సింహాద్రి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నేషనల్ సైన్స్ డే

'రామన్ ఎఫెక్ట్' కనిపెట్టిన రోజును పురస్కరించుకుని వేడుకలు

భారతీయ భౌతిక శాస్త్రవేత్త, భారత రత్న, నోబెల్ పురస్కార గ్రహీత సర్ సీవీ రామన్ రామన్ ఎఫెక్ట్‌ను కనిపెట్టిన రోజును పురస్కరించుకుని మేడ్చల్ నియోజకవర్గంలో జాతీయ సైన్స్ దినోత్సవంను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, గ్రామాల పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో సైన్స్‌కు సంబంధించిన వివిధ కార్యక్రమాలు, సైన్స్ ఫెయిర్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, వక్తలు సైన్స్ యొక్క అవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ఇందులో భాగంగా పలు విద్యా సంస్థలు విద్యార్థులు చేపట్టిన సైన్స్ ప్రయోగాలు, ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. – మేడ్చల్ జోన్ బృందం



మేడ్చల్: సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభకనబర్చిన శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న, ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ ప్రశాంత్, బాబుసింగ్, రమణారావు, సీతారాంరెడ్డి, జైపాల్ రెడ్డి, అహ్మద్ చంద్రశేఖర్ తదితరులు



మేడ్చల్: పట్టణంలోని సెయింట్ ప్యాట్రిక్స్ పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన స్టాల్స్‌ను తిలకిస్తున్న ఎంఈఓ వసంతకుమారి తదితరులు



మేడ్చల్: అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను తిలకిస్తున్న నూతన్‌కల్ సర్పంచ్ కవిత జీవన్, కౌన్సిలర్ మహేష్



కీసర: అరుంధతి పాఠశాలలో...



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు చేపట్టిన ప్రదర్శనలు తిలకిస్తున్న హెచ్‌ఎం రంగాచారి, ఉపాధ్యాయులు





ఘట్‌కేసర్: ఎదులాబాద్ జెడ్పీ బాలురు, బాలికల పాఠశాలలో విద్యార్థులు చేపట్టిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న చైర్‌పర్సన్ పావనీయాదవ్, వైస్‌చైర్మన్ మాధవరెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, చిత్రంలో కౌన్సిలర్ శశికళ, హెచ్‌ఎంలు అనిత, పాపిరెడ్డి, ఉపాధ్యాయులు



జవహర్‌నగర్: క్రై స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జెడ్పీహెచ్ఎస్‌లో జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మేయర్ మేకల కావ్య జిల్లా సైన్స్ ఆర్గనైజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ అనిల్‌కుమార్, సంస్థ ప్రతినిధి హేమబిందు, రిటైర్డ్ డీఎస్‌ఓ ప్రభాకర్, హెచ్‌ఎం కె.శేఖరయ్య తదితరులు